రాయితీ విత్తనాల పంపిణీ: జేడీ వరలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): త్వరలోనే రాయితీ వేరుశనగ విత్తనాలను అర్హులైన రైతులందరికీ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గురువారం వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి విలేకరులకు తెలిపారు. 40శాతం సబ్సిడీపై రైతులకు ఈ విత్తనాలను అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా పది ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని, 30 కిలోల వేరుశనగ విత్తన కాయల పూర్తి ధర రూ.2,790 కాగా, సబ్సిడీ రూ.1,116 పోగా మిగిలిన మొత్తం 1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

- 17 కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్షలు
- కర్నూలు జిల్లాలో 8, హైదరాబాదులో 9 కేంద్రాలు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు. మెగా డీఎస్సీ పరీక్షలు ఈ నెల 6నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55,177 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరికోసం 17 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇందులో హైదరాబాదులో 9, కర్నూలులో 8 సెంటర్లను ఏర్పాటుచేశారు. కర్నూలు నగరంలో ఆరు కేంద్రాలు, ఆదోని, ఎమ్మిగనూరు ఒక్కొక్క పరీక్షా కేంద్రాన్ని సిద్ధం చేశారు. ఈ పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్ కాగా, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుంది. కర్నూలు జిల్లాలో ప్రతి రోజూ 8 పరీక్షా కేంద్రాల్లో 2,140 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ పరీక్షలకు హాజరయ్యేలా ఏర్పాటు చేశారు.

అరగంట ముందే చేరుకోవాలి : శామ్యూల్ పాల్, డీఈవో

ఈ నెల 6వ తేదీ నుంచి జరిగే మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రా నికి అభ్యర్థులు అరగంట ముందుగానే చేరుకోవాలి. డీఎస్సీ పరీక్షకు సంబంధించి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే కర్నూలు జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలి. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్ప్‌డెస్క్‌కు ఫోన్ చేసి సమస్యలను అభ్యర్థులు నివృత్తి చేసుకోవచ్చు. హెల్ప్‌డెస్క్ నెంబర్లు 8121821266, 9603683182, 9177679042, 9032397231లను సంప్రదించాలి. ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలకు డిపార్టుమెంటు ఆఫీ సర్లు వెళ్లి పరిశీలిస్తారు. సమస్యలు ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశాలిచ్చాం.



వేరు శనగ రైతులు దగా

ఈ రైతు పేరు మారెప్ప. క్రిష్ణగిరి మండలంలోని మల్యాలకు చెందిన ఇతడు గత రబీలో గాజులదిన్నె జలాశయం కింద వేరుశనగ పంటను రెండెకరాల్లో సాగు చేశాడు. కర్నూలు మార్కెట్ యార్డుకు రెండు రోజుల క్రితం పంట దిగుబడిని అమ్మేందుకు తెచ్చాడు. వ్యాపారులు కేవలం రూ.6,500 ధర మాత్రమే ఒక క్వింటానికి చెల్లించారు. ప్రస్తుతం ఏపీ సీడ్స్ సంస్థ వేరుశనగ విత్తనకాయలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. క్వింటానికి రూ.9,300 చెల్లిస్తామని ప్రకటించింది. ఈ విషయం తెలిసి రైతు ఏపీ సీడ్స్ అధికారులను కలిశాడు. తన వద్ద నాణ్యమైన వేరుశనగ కాయలు ఉన్నాయని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనాలని కోరాడు. అయితే.. తాము కొనే అవకాశం లేదని అధికా రులు చెప్పడంతో మరో దారి లేక కర్నూలు మార్కెట్ యార్డులోనే విక్రయించాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేరుశనగ రైతులందరి దుస్థితి ఇది.



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్‌లో రైతులకు విత్తనం కోసం 40 శాతం సబ్సిడీపై నాణ్యమైన వేరుశనగ కాయలను పంపిణీ చేయాలని ఏపీ సీడ్స్ సంస్థ నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్వింటానికి రూ.9,300 చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లాకు 9,099 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 2,009 క్వింటాళ్లు రాయితీపై అందించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ అనుమతి ఇచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాబోయే ఖరీఫ్‌లో దాదాపు 90వేల హెక్టార్లలో వేరుశనగ పంటను సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇంత విస్తీర్ణంలో పంట సాగుకు దాదాపు 20వేల నుంచి 30వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతుంది. అయితే ప్రభుత్వం ఎప్పుడూ ఇంత పెద్దమొత్తంలో విత్తనాలను రాయితీపై రైతులకు అందించేందుకు శ్రద్ధ చూపలేదు.

వ్యాపారుల దోపిడీ

గత వైసీపీ ప్రభుత్వంలో రాయితీపై రైతులకు వేరుశనగ కాయలను అందించాలని తీసుకున్న నిర్ణయం అమలు కాలేదు. వాస్తవానికి ఏపీ సీడ్స్ సంస్థ అధికారులే రైతులకు మూల విత్తనాన్ని (ఫౌండేషన్ సీడ్స్) అందించి వారికి సరైన సూచనలు ఇచ్చి విత్తనోత్పత్తి చేయించాలి. ఆ విత్తనాలను ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ విధానానికి తూట్లు పొడిచేశారు. కనీసం మార్కెట్ యార్డుల్లో రైతులు తెచ్చిన నాణ్యమైన వేరుశనగ కాయలను కొనుగోలు చేసి మళ్లీ రైతులకే ఖరీఫ్‌లో రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, ఆ విధానానికీ స్వస్తి చెప్పేశారు. వ్యాపారులైతే తమకు పెద్దమొత్తంలో కమీషన్లు అందిస్తారనే ఉద్దేశంతో వారికే విత్తన సేకరణ అధికారాన్ని కట్టబెట్టారు. ఇది ప్రభుత్వానికి పెద్దఎత్తున భారం కావడమే కాకుండా రైతులకు కూడా ప్రభుత్వం అందించే 40 శాతం సబ్సిడీ వల్ల ఏ మాత్రం ప్రయోజనం కలగలేదు. వ్యాపారులు

- రాయితీ వేరుశనగ విత్తన సేకరణలో భారీ దోపిడీ
- రైతు నుంచి కాకుండా వ్యాపారుల నుంచే కొనుగోలుకు ఏపీ సీడ్స్ నిర్ణయం
- రైతులకు ఇచ్చేది క్వింటం రూ.6,500
- ఏపీ సీడ్స్ వ్యాపారులకు రూ.9,300
- క్లీనింగ్, రవాణా ఖర్చులు పోను క్వింటంపై వ్యాపారులకు రూ.2వేలు లాభం
- ఉమ్మడి జిల్లాలో 11,108 క్వింటాళ్ల కొనుగోలుకు ఏపీ సీడ్స్ సిద్ధం

ఏపీ సీడ్స్ క్వింటానికి అందిస్తున్న రూ.9,300లో భారీ ఎత్తున మూటగట్టుకునేందుకు నాసిరకం విత్తనాలను సేకరించే కార్యక్రమాన్ని ప్రస్తుతం చేపడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- భవిష్యత్ తరాలకు భరోసా ఇవ్వాలి
- కలెక్టర్ పి. రంజిత్‌బాషా



మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి, ప్రజారోగ్యానికి పెనుభూతంగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమక్రమంగా నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సునయన ఆడిటోరియంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రతి విషయంలో ప్లాస్టిక్‌పై ఆధారపడటం సర్వసాధారణంగా మారిందని, దీని వల్ల ప్లాస్టిక్ కాలుష్యం అధికమై జీవరాశి మనుగడ ప్రశ్నార్థకంగా తయారైందన్నారు. భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. అంతకు ముందు జిల్లాపరిషత్ కార్యాలయం నుంచి కలెక్టర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. దీనిని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ లీలా వెంకట శేషాద్రి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య, ఆర్డీవో సందీప్ కుమార్ ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేదంపై విద్యార్థులతో నాటికలు, నృత్యాలు, చైతన్య గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.



ఆత్మకూరు సమీపంలో ఓవర్‌లోడ్‌తో ప్రమాదానికి గురైన వాహనం.. క్షతగాత్రులు (ఫైల్)

భద్రతకు భరోసా ఏదీ..?

నంద్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణం సాఫీగా సాగి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలంటే రహదారుల భద్రత కూడా ఎంతో ముఖ్యం. ప్రధానంగా రహదారులు, హైవేపై ప్రమాదాలు జరగకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. కానీ ఎక్కడా కూడా అన్ని చర్యలు కనిపించడం లేదు. దీంతో జిల్లాలో రహదారులు నెత్తు రోడుతున్నాయి. రోజు ఏదో ఒకప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధిక శాతం ప్రమాదాలు వాహనచోదకుల నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయి. అజాగ్రత, నిబంధనల అతిక్రమణ, మితిమీరిన వేగం, రహదారులపై ఎక్కడప డితే అక్కడ వాహనాలను నిలపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితరాలు ప్రమాదాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. ప్రమాదాలలో వందల సంఖ్యలో మృత్యువాత పడుతుండగా.. వేలాది మంది క్షతగాత్రులై కాళ్లు చేతులు ఇతర శరీర భాగాలు కోల్పోయి వికలాంగులవుతున్నారు. ఫలి తంగా వారి కుటుంబాలు చిన్నభిన్నమవుతున్నాయి. వంద ప్రమాదాల్లో 70శాతం ప్రమాదాలు అతివేగంతో జరిగినవే అని అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదాల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నా.. అనేక మంది వాహన చోదకుల్లో ఏమాత్రం మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

- నెత్తురోడుతున్న రహదారులు
- నిర్లక్ష్యం, అతివేగమే కారకాలు
- రోజురోజుకు పెరుగుతున్న ప్రమాద తీవ్రత
- మారని వాహనచోదకులు
- మూడేళ్లలో 1775 ప్రమాదాలు
- 965మంది మృత్యువాత.. 2329 మందికి గాయాలు
- వేగ నియంత్రణలో విఫలమవుతున్న అధికారులు
- చాలా చోట్ల కానరాని హెచ్చరిక బోర్డులు

రోడ్డు ఎక్కాలంటేనే సగటు మనిషి బెంబేలెత్తిపోతున్నాడు.. మనిషి భద్రతకు భరోసా లేకుండా పోతోంది. మనం అన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎటునుంచి ఏ వాహనం వచ్చి ఢీకొట్టిపోతుందో అన్న భయం నెలకొంది. రోడ్డు ప్రమా దాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రహదారులు నెత్తురోడుతున్నాయి. అతివేగం, నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అలాగే పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోవడం కూడా ఒక కారణమని చెప్పవచ్చు. ప్రమాదాల్లో గాయపడ్డ వారు దివ్యాంగులుగా మారుతున్నారు. ప్రమాద బాధితుల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ప్రమాదాలను నియంత్రించాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. అలాగే హైవేలు, రహదారులపై వేగాలను నియంత్రించేందుకు ఏర్పాటు చేయాల్సిన సూచిక బోర్డులు కూడా చాలా చోట్ల కనిపించడం లేదు.




ప్యాపిలి వద్ద బోల్తా పడిన కారు (ఫైల్)

ప్రజల్లో భయాందోళన..

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్డుపైకి రావాలంటేనే జంకాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో మూడేళ్లలో 1775 ప్రమాదాలు జరిగాయి. అందులో 2329 మంది గాయపడగా.. 965మంది మృత్యువాత పడ్డారు. ఇందులో గాయపడిన చాలామంది దివ్యాంగులయ్యారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని చెప్పలేం. గతంలో జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాలు పరిశీలిస్తే.. మొత్తం డ్రైవర్ తప్పిదంతోనే చోటు చేసుకున్నవి కావని పలు కేసుల్లో స్పష్టమైంది. గతంలో రోడ్డు సేఫ్టీ విభాగం ఏర్పాటు చేశారు. జాతీయ రహదారులపై వేగ నియంత్రణ, ప్రమాదాలు నివారణకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అయితే రోడ్డు సేఫ్టీ విభాగం పనితీరు జిల్లాలో కంటి తుడుపు చర్యలకే పరిమితమైందనే విమర్శలు లేకపోలేదు.

మిగతా 6వ పేజీలో

కర్నూలులో మరో నాలుగు కొవిడ్ కేసులు



కర్నూలు హాస్పిటల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఒకే రోజు నాలుగు కొవిడ్ కేసులు గురువా రం నమోదయ్యాయి. బుధవారం ఆరు మంది అనుమానిత రోగులకు ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా, అందులో నలుగురికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇద్దరికి నెగిటివ్ వచ్చింది. కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడుకు చెందిన 25 ఏళ్ల మహిళ, అనంతపురం జిల్లా పెద్దవడగూరు మండలం ఏ.తిమ్మాపురం చెందిన 49 ఏళ్ల ఓ వ్యక్తికి, గోనెగండ్ల మండలం లింగందిన్నెకు చెందిన 45ఏళ్ల వ్యక్తి, కర్నూలు నగరానికి చెం దిన 20 ఏళ్ల ఓయువతికి కొవిడ్ నిర్ధారణ అయ్యింది. ఇందులో లింగందిన్నె, అనంతపురం జిల్లాకు చెందిన కొవిడ్ రోగులు కర్నూలు జీజీహెచ్‌లోని ఎంఎం-5లో, దిన్నెదేవరపాడు చెందిన రోగి ఎఫ్‌ఎం-3, కర్నూలుకు చెందిన 20ఏళ్ల యువతి కొవిడ్ వార్డులో చికిత్స పొందుతున్నారు. కొవిడ్ రోగులను సాధారణ వార్డులోనే ఉంచడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో నాలుగు కొవిడ్ కేసులు వెలుగు చూడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

వేరు శనగ రైతులు దగా

(5వ పేజీ తరువాయి)

కర్నూలు జిల్లాతో పాటు తెలంగాణలోని వనపర్తి, గద్వాల ప్రాంతాల్లో రైతుల నుంచి వేరుశనగ కాయలను క్వింటానికి రూ.6వేల నుంచి రూ.6,500 చెల్లించి నెల కిందటే గోదాముల్లో దాచారు. ప్రస్తుతం ఏపీ సీడ్స్ సంస్థ క్వింటం విత్తనానికి రూ.9,300 ధర చెల్లించేందుకు నిర్ణయించడంతో తమ జేబులు నిండినట్లేనని ఆశ పడుతున్నారు. విత్తనాల క్లీనింగ్, రైతు సలహా కేంద్రాలకే చేర్చేందుకు రవాణా తదితర ఖర్చులన్నీ కలిపి క్వింటానికి రూ.1000 దాకా ఖర్చు వస్తుందని వారు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం చెల్లించే రూ.9,300 ధరతో పోలిస్తే రవాణా ఖర్చులు రైతులకిచ్చే రూ.6500 పోను తమకు ఒక క్వింటంపై రూ.2వేల దాకా మిగులుతుందని ఆశిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన 11,108 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల వల్ల కేవలం ఒక నెలలోనే దాదాపు రూ.2 కోట్లు మిగుల్చుకునే అవకాశం వారికి ఏర్పడింది. రైతులతో కొనుగోలు చేసింటే పెద్ద ఎత్తున ప్రభుత్వానికి విత్తన సేకరణలో భారం తగ్గడమే కాకుండా రైతులకు మంచి ధర చెల్లించే అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం తమ నుంచి రాయితీ విత్తనాలు కొనుగోలు చేస్తుందని రైతులు ఎంతగానో ఆశించారు అయితే ఏపీ సీడ్స్ సంస్థ రాష్ట్ర అధికారులు తీసుకున్న నిర్ణయం వారిని నిరాశపరిచింది.

రైతుల నుంచి ఎందుకు కొనరు?



గత వైసీపీ ప్రభుత్వం మా పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కనీసం ఈ ప్రభుత్వమైనా రాయితీపై అందించే విత్తనాలను మా నుంచే కొంటుందేమో అని ఆశపడ్డాం. నేను ఏపీ సీడ్స్ అధికారులకు ఫోన్ చేసి వేడుకున్నా. నిబంధనల ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదని సమాధానం ఇచ్చారు. వాస్తవంగా ఏపీ సీడ్స్ అధికారులు మాకు మూల విత్తనాన్ని అందించి, మాచేత నాణ్యమైన విత్తనోత్పత్తి చేయించాలి. వాటిని ఆ సంస్థే కొనాలి. ఆ లక్ష్యానికి ఏపీ సీడ్స్ సంస్థ ఎప్పుడో నీళ్లొదిలింది. మరో దారి లేక నేను మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చి తక్కువ ధరకే వేరుశనగ కాయలను వ్యాపారుల చేతుల్లో పెట్టాను.

- లక్ష్మీనారాయణ, మన్నెకుంట

నిబంధనల ప్రకారమే కొంటున్నాం



నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆదేశాలపై ఆర్గనైజర్ల నుంచి వేరుశనగ విత్తనాలను సేకరిస్తున్నాం. విత్తనాల క్లీనింగ్, రవాణా ఖర్చులు మొదలైన వాటిని పరిశీలించి ప్రభుత్వం ప్రతి సంవత్సరం సేకరణ ధరను నిర్ణయిస్తుంది. ఎవరైనా వ్యాపారులు నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

- ధనలక్ష్మి, ఏపీ సీడ్స్ మేనేజర్

ప్రభుత్వ బడికి రండి..!

- ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి
- అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్
- తల్లిదండ్రులను కలుస్తున్న ఉపాధ్యాయులు
- గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



బడిబయట పిల్లలు బడిలో చేర్పించేందుకు అవగాహన ర్యాలీ చేస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

చాగలమర్రి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అడ్మిషన్ల డ్రైవ్ కొనసాగుతోంది. సమగ్రశిక్ష అధికారులు, సీఆర్పీలు, ఐఈఆర్టీలు, ఉపాధ్యాయులు బృం దాలుగా ఏర్పడి బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తు న్నారు. ఇంటింటికి వెళ్లి ఎన్‌రోల్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలంటూ తల్లిదండ్రులను కోరుతున్నారు. గిరిజన ప్రాంతాలతో పాటు ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉపాధి పనులు చేసే కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పథకాలను వివరిస్తున్నారు. గ్రామాల్లో ర్యాలీల ద్వార అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. 117 జీవో రద్దుతో పాటు మోడల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధంచేసింది. పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటుచేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియామించనుంది. పాఠశాలల సర్దుబాటు, విలీనప్రక్రియ, ఉపాధ్యాయుల కేటాయింపులో తప్పులను సరిదిద్దనుంది.

యూనిఫామ్, బ్యాగుల్లో మార్పు



'మనబడి-మన భవిష్యత్తు' పథకం ద్వారా సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో బ్యాగులను ముద్రించి జిల్లాలోని ఆయా పాఠశాలలకు సరఫరా చేసింది. జిల్లాలో 1,959 పాఠశాలలకు 1 నుంచి 10 వరకు చదివే విద్యార్థులకు కొత్తగా మూడు జతల యూనిఫారాలను పంపిణీ చేసేందుకు సిద్ధంచేసింది. ఆయా మండల కేంద్రాలకు వాటిని సరఫరా చేశారు. బడి తెరిచే నాటికి విద్యార్థులకు కిట్ల రూపంలో పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

వైసీపీ హయాంలో 117 జీవో ద్వారా..

నంద్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,959 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 3.63 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో చాగలమర్రిలో 8,744 మంది విద్యార్థులు, ఆళ్లగడ్డలో 15,922, దొర్నిపాడు 2,519, శిరివెళ్ల 8,122, రుద్రవరం 5,748, ఉయ్యాలవాడ 2,231మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు లేరన్న సాకు చూపి వైసీపీ ప్రభుత్వ హయాంలో 117జీవో ద్వారా విద్యార్థులు లేని పాఠశాలలను సమీప స్కూళ్లలో విలీనం చేశారు. జిల్లాలో 10 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు అధికంగా ఉన్నాయి. విలీనం నేపథ్యంలో 3వ తరగతికి వస్తే మరో పాఠశాలలో చేర్పాల్సి ఉండటంతో తల్లిదండ్రులు కూడా పెద్ద ఆసక్తి చూపలేదు. ప్రైవేటు బడుల వైపు మొగ్గు చూపారు. ఫలి తంగా ప్రభుత్వ పాఠశాలలు ఖాళీగా కనిపించాయి. ఇన్ని సమస్యలు ఉంచుకొని పాఠశా లల స్వరూపానే మార్చేశామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. నాడు-నేడు పథకంతో పాఠశాల భవనాలను నిర్మించినట్లు, ఫర్నిచర్, ఇతరత్రా సదుపాయాలు కల్పించినట్లు చెప్పింది. ఇలా పనులు చేపట్టిన వందలాది పాఠశాల భవనాలు వృథాగా, అసంపూర్తిగా ఉన్నాయి.

స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత..

స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌లో 50మంది ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టనుంది. ఇప్పటి వరకు ప్రతి మండలంలో 5 నుంచి 10వరకు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండేవి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వాటి సంఖ్య తగ్గే అవకాశం ఉంది. నిర్దేశిత సంఖ్యలో ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైతే బోధన, ఇతరత్రా అంశాలపై ఉపాధ్యాయులకు మరింత అవగాహన పెరిగే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో స్కూల్ కాంప్లెక్స్ మావేశాలు తూతూ మంత్రంగా జరిగాయి. పాఠశాలలపై అధికారులు, హెచ్‌ఎంల పర్యవేక్షణ కూడా తగ్గడంతో విద్యాబోధన, పరీక్షా ఫలితాలపై ప్రభావం చూపింది. అందుకే తిరిగి హెచ్‌ఎంలకే పర్య వేక్షణ బాధ్యతలు అప్పగించనుంది. మండలానికి ఒక ఎంఈవోను పరిమితం చేయనుంది.

విద్యార్థుల కోసమే స్పెషల్‌డ్రైవ్



బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సం ఖ్య పెంచేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టాం. వేసవిసెలవుల ప్రారంభానికి ముందుగానే ఎన్ రోల్‌మెంట్ సర్వే చేస్తున్నాం. సమగ్రశిక్షణ అధికారులు, సీఆర్పీలు, కస్తూర్బా, విద్యాశాఖ సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని చేపడుతున్నారు. తల్లిదండ్రుల నుంచి సానుకూలతలు వస్తున్నాయి.

- న్యామతుల్ల, ఎంఈవో, చాగలమర్రి



ఎన్‌రోల్‌మెంట్ సర్వే చేస్తున్న కస్తూర్బా ఉపాధ్యాయిణిలు

పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ఏజెంట్ల దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు న్యూసిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు డివిజన్ పరిధిలోని తపాలా శాఖలో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్లుగా కమీషన్ ప్రాతిపదికన పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండి పదో తరగతి ఆపైన పాసైన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 27 తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పాత బస్టాండు ప్రధాన తపాలా కార్యాలయంలో నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపిక చేసిన ఏజెంట్లు సెక్యూ రిటీ డిపాజిట్ రూ.5 వేలు ఎన్ఎస్‌సీ /కేవీపీ రూపంలో(రీఫండబుల్) చెల్లించాలన్నారు. వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఫోన్ 7013029312లో సంప్ర దించాలన్నారు.

ఆర్ఐవోగా సురేష్‌బాబు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఆర్ఐవోగా సి.సురేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా వృత్తివిద్యాధికారిగా కొనసాగుతున్న ఆయన్ను తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఐవోగా నియమించింది. దీంతో ఈ స్థానంలో పనిచేస్తున్న ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టిని విధుల నుంచి తప్పించి ఓర్వకల్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేలా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృతిక శుక్ల ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సురేష్‌బాబు మాట్లాడుతూ జిల్లాలోని ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాధ్యతలు చేపట్టిన సురేష్ బాబును కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.లాలెప్ప, సుంకన్న, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు చేపట్టిన సి.సురేష్‌బాబు

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- మత సామరస్య కమిటీ సమావేశం

ఆదోని , జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో అన్నిమతాల పెద్దలతో మత సామరస్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మా ట్లాడుతూ ఆదోని మత సామరస్యానికి ప్రతీక అని, అందరి సహకారంతో ఇది సాధ్య మైందని, ఈసహకారాన్ని ఇలాగే కొనసాగించాలన్నారు. బక్రీద్ పండుగను ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సున్నితమైన సమస్య వచ్చినా వెంటనే పోలీస్, రెవెన్యూ శాఖలకు తెలియజేయాలని సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మునిసిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ శివరాముడు, పీస్ కమిటీ సభ్యులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, ఎగ్గాటి ప్రతాప్, సౌదీ రావుఫ్, మత పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

రామలింగేశ్వరుని సన్నిధిలో హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి హరిహరనాథశర్మకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

పత్తికొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి హరి హరనాథశర్మ గురువారం పత్తికొండ మండలంలోని మండగిరి గ్రామంలో పురాతన రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పత్తికొండ సీనియర్ న్యాయవాదులు చంద్రశేఖర్‌నాయుడు, యల్లారెడ్డి, సత్యనారాయణ, శశికళ, క్రిష్ణ, జూనియర్ న్యాయవాది బత్తిని అరుణ్‌కుమార్ ఆయనతోపాటు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకాన్ని అందరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం గార్గేయపురం నగరవనంలో వన మహోత్సం-2025లో భాగంగా మొక్కలను నాటారు. కాలుష్యాన్ని అరికట్టాలంటే మొక్కల పెంపకం ఒక్కటే మార్గమన్నారు. పత్తికొండ శాసన సభ్యుడు కేఈ శ్యాంకుమార్ మాట్లాడుతూ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమల పరిధిలో మొక్కలు నాటాలని తెలిపారు. అనంతరం నగరవనంలో చిన్న పిల్లల పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, డీఎఫ్‌వో శ్యామల, ఫ్లయింగ్ స్క్వాడ్ రవిశంకర్, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా విష్ణువర్దన్ రెడ్డి

నేడు ప్రమాణ స్వీకారోత్సవం



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా ఎదురూరు విష్ణువర్దన్ రెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేస్తారని సీఈవో రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ల బదిలీ

నంద్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా గురువారం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేస్తున్న డి.రవికుమార్‌ను కర్నూలుకు, అక్కడ పనిచేస్తున్న ఏవో ఐ.విజయశ్రీని నంద్యాలకు బదిలీ చేశారు. బేతంచెర్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.ప్రకాష్‌బాబు, డీన్ డిప్యూటీ తహసీల్దార్ కె.పురుషోత్తంను కర్నూలు జిల్లాకు కేటాయించారు. కర్నూలు అర్బన్ డీటీగా పనిచేస్తున్న వి.గిరి కుమార్‌రెడ్డిని నంద్యాల జిల్లాకు కేటాయించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు ఇలా...

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
శివరాముడు	ఆదోని	కలెక్టరేట్, కర్నూలు
సీహెచ్.ఇంద్రాణి	కలెక్టరేట్, కర్నూలు	సూపరింటెండెంట్, కలెక్టరేట్
గోవింద్ సింగ్	ఆలూరు	ల్యాండ్ విభాగం, కలెక్టరేట్
నజ్మాభాను	హాలహర్వి	కేఆర్ఆర్‌సీ, కలెక్టరేట్
శ్రీనాథ్	పెద్దకడబూరు	ఎల్ఆర్ విభాగం, కలెక్టరేట్
కుమారస్వామి	గోనెగండ్ల	కేఆర్‌సీసీ, ఆర్డీఓ, కర్నూలు
రాజేశ్వరి	కలెక్టరేట్, కర్నూలు	గోనెగండ్ల
రమాదేవి	తుగ్గలి	మంత్రాలయం
ఎం.ఏ.రమేష్	పత్తికొండ	ఆదోని
రవికుమార్	ఏఓ, నంద్యాల	కర్నూలు అర్బన్
వెంకటేష్ నాయక్	కోడుమూరు	గూడూరు
వెంకటలక్ష్మి	కర్నూలు అర్బన్	సీ.బెళగల్
హుసేన్ సాహెబ్	మద్దికెర	పత్తికొండ
ప్రకాష్ బాబు	బేతంచెర్ల	కృష్ణగిరి
ఎస్.రవి	మంత్రాలయం	తుగ్గలి
రామాంజనేయులు	గూడూరు	దేవనకొండ
వేణుగోపాల్	కలెక్టరేట్, కర్నూలు	కోసిగి
కె.పురుశోత్తం	నంద్యాల జిల్లా	కర్నూలు జిల్లా

మొక్కజొన్న ధర పతనం..

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఎంతో ఆశతో గిట్టుబాటు ధర వస్తుందని వివిధ ప్రాంతాల నుంచి రైతులు మార్కెట్ యార్డుకు మొక్కజొన్నలను అమ్మకానికి తీసుకువచ్చారు. అయితే.. కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డుకు 59 క్వింటాళ్ల మొక్కజొన్నలను రైతులు అమ్మకానికి తెచ్చారు. ప్రభుత్వం క్వింటం మొక్కజొన్నలకు 2,225లు మద్దతు ధరగా ప్రకటించింది. అయితే వ్యాపారులు కూడబలుక్కొని ఈ మద్దతు ధరను రైతులకు అందకుండా చేశారు. గరిష్ఠ ధర కేవలం రూ.2,069, మధ్యస్థ ధర రూ.2,063, కనిష్ఠ ధర రూ.1,869 మాత్రమే దక్కడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగో పట్టణ సీఐగా విక్రమసింహ



బాధ్యతలు స్వీకరించిన సీఐ విక్రమసింహ

కర్నూలు క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ సీఐగా విక్రమసింహ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఈయన చిత్తూరు జిల్లాలో పని చేశారు. 2013లో సీఐగా పదోన్నతి పొంది, సీఐడీ, పత్తికొండ, డీసీఆర్‌బీ, కర్నూలు వన్‌టౌన్, సిరివెళ్ల, కర్నూలు తాలుకా, ఆదోని వన్‌టౌన్, దిశా తదితర పోలీస్ స్టేషన్‌లలో పని చేశారు. కొద్ది రోజుల కింద ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ పని చేస్తూ వీఆర్‌కు వచ్చారు. వీఆర్‌లో ఉన్న ఆయన్ను నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

పర్యావరణం కోసం మొక్కలను నాటాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్థి



జిల్లా కోర్టు ఆవరణంలో మొక్కను నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్థి

కర్నూలు లీగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయాధి కారి జి.కబర్థి కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా గురు వారం స్థానిక జిల్లా కోర్టు ఆవర ణంలో ఆయన మొక్కలను నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణంలో మొ క్కలను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించుకోవా ల్సిన బాధ్యత కూడా ఉందని తెలిపారు. బాలబాలికలు విద్యార్థి దశలోనే పర్యావరణంపై అవగాహన పెంచుకునేం దుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో 6వ అదనపు జిల్లా న్యాయాధికారి వాసు, న్యాయ సేవాధికా రసంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, కర్నూలు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టెలికాం నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెలికాం నగర్‌లో గురువారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరిగింది. సుంకులమ్మ అనే వృద్ధురాలు టైలర్ షాపు నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. బైక్‌పై ఇద్దరు ఆగంతకులు వచ్చి ఆమె మెడలోని గొలుసును తెంపుకుని ఉడాయించారు. వృద్ధురాలు కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. అపహరణకు గురైన గొలుసు విలువ 3తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు.

భద్రతకు భరోసా ఏదీ?

5వ పేజీ తరువాయి

పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులకు ఎక్కించుకోవడంతో ప్రయాణించడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధానంగా ఆటోలు, బస్సులు, రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులను తరలిస్తున్నారు. ఆటోల్లో అయితే మరీ దారుణం. డ్రైవర్ పక్కనే నలుగురిని ఎక్కించుకుని ప్రయాణిస్తున్నారు. దీంతో డ్రైవర్ స్టీరింగ్ తిప్పే పరిస్థితి లేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రమాదాలకు కారణాలు ఇవే..

మితిమీరిన వేగం, మద్యం, నిద్రమత్తు, ఓవర్ టెక్, ఆకస్మాత్తుగా వాహనాన్ని నిలపడం, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమణ, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అస్తవ్యస్తంగా పలు రహదారులు ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయని తెలుస్తోంది. ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలే ప్రమాదాలకు గురైనట్లు జిల్లా పోలీసు యంత్రాంగం పేర్కొంటోంది.

ప్రమాదాలను నియంత్రించలేకపోయాయి..

పోలీసు, ఆర్టీఏ, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవేస్ శాఖలు ఆశించిన స్థాయిలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించలేకపోయాయన్న విమర్శలు లేకపోలేదు. జిల్లాలోని పలు ప్రధాన. జాతీయ రహదారులపై వేగనియంత్రణలో విఫలమవుతున్నారు. ఎస్పీ, ఆర్టీఏ శాఖల ఉన్నతాధికారులు ఎన్ని ఆదేశాలు జారీచేసినా. క్షేత్రస్థాయిలో నామమాత్రపు తనిఖీ లతో మమ అనిపించేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం జరిమానాలు, కేసులు నమోదుకే పరిమితమవుతున్నారు. దీంతో తరచూ రోడ్డుప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా జాతీయ రహదారిపై అతివేగంతో వాహనాలు ప్రయాణిస్తున్నా. వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం హైవేల్లో మలుపులు, ప్రమాదకర ప్రాంతాల్లో తగిన సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

మానవ తప్పిదంతోనే ప్రమాదం



డ్రైవింగ్ చేసే సమయంలో మానవ తప్పిదాలతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఓవర్ లోడుతో పాటు అతివేగంతో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదు. శాఖల పరంగా సమష్టిగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తున్నాం.

-శ్రీకాంత్, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, నంద్యాల

ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



రహదారులపై అతివేగంతో ప్రయాణించి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. మద్యం సేవించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరం. హెల్మెట్ వాడకం, సీట్ బెల్ట్ ధరించిన సమయంలో ప్రమాదం జరిగినా ప్రాణాలకు కొంతవరకు ముప్పు తగ్గే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

-అధిరాజ్ సింగ్ రాణా, ఎస్పీ, నంద్యాల

ఆటోను ఢీకొన్న కర్ణాటక బస్సు

- ఒకరికి తీవ్ర గాయాలు



నుజ్జు అయిన ఆటో

ఆదోని రూరల్, జూన్ 5 ఆంధ్రజ్యోతి) : ఓ ఆటోను కర్ణాటకకు చెందిన బస్సు ఢీకొనడంతో ఒకరి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఆరేకల్ సమీపంలో గురువారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. వివరాలు.. గ్రామ సమీపంలో వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కర్ణాటక బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నరసింహులుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను స్థానికులు పట్టుకొని తాలుకా పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బెట్టింగ్ రాయుళ్లు అరెస్టు

- 4 సెల్‌ఫోన్లు, రూ.3.40లక్షల నగదు స్వాధీనం
- ఇన్‌చార్జ్ సీఐ మన్సూరుద్దీన్ వెల్లడి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ సీఐ మన్సూరుద్దీన్

కోడుమూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జ్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న ఐపీల్ ఫైనల్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో శ్రీరామచంద్ర టాకీస్ దగ్గర నలుగురు వ్యక్తులు బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. వెంటనే ఎస్ఐ డి.వై స్వామి, ఏఎస్ఐ శంకర్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్ మద్దీశ్వర్, మహబుబ్‌బాషా, మురారి, కానిస్టేబుల్ జగదీష్, విజయ్‌కుమార్, భాస్కర్, ఓంకార్ మరి కొంత మంది హోంగార్డులు దాడులు చేశారు. కోడుమూరు పట్టణానికి చెందిన గుజరాతి వినోద్ కుమార్, మాదుగుండు వేణుగోపాల్, సోమశేఖర్, పాలవారి భాస్కర్‌రెడ్డి సెల్‌ఫోన్లలో బెంగుళూరు, పంజాబ్ మ్యాచ్‌ను వీక్షిస్తూ బెట్టింగ్‌కు పాల్పడుతుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి 4సెల్‌ఫోన్లు, రూ.3.40లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన బెట్టింగ్ రాయుళ్లను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. బెట్టింగ్ రాయుళ్లను పట్టుకొన్న ఎస్ఐ డి.వై స్వామి, సిబ్బందిని సీఐ అభినందించారు.

వైసీపీ ఉన్మాదులను ప్రజలు తిరస్కరించారు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు, అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వైసీపీలోని నియంతలు, ఉన్మాదులను ప్రజలు తిరస్కరించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన రోజుగా జూన్ 4 మిగిలిపోతుందన్నారు. పౌరులు స్వేచ్ఛ పొందిన రోజని అన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో తమకు ఓటేయలేదని ప్రజలే వెన్నుపోటు పొడిచారంటూ వైసీపీ వారు కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ వెన్నుపోటు వైసీపి పార్టీకే వర్తిస్తుందని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి జైలుకు వెళ్తాడనే భయంతో ఉనికి చాటుకునేందుకు వైసీపీ వెన్నుపోటు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కేవీ సుబ్బారెడ్డి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్, చంద్రకాంత్, పుల్లయ్య, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

12న నంద్యాలకు వైఎస్ షర్మిల

- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 12వ తేదీన నంద్యాలకు వస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ తెలిపారు. గురువారం నంద్యాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ చాకలి పుల్లయ్య అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో షర్మిల సమావేశం నిర్వహిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగట్టడానికి వైఎస్ షర్మిల జిల్లా పర్యటనకు వస్తున్నట్లు తెఇపారు. నాయకులు, కార్యకర్తలు, అన్నివర్గాల ప్రజలు పర్యటనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి రియాజ్, ఆర్గనైజర్ రజాక్‌వలి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా పఠాన్ సలీం

డీసీసీ ఉపాధ్యక్షుడిగా పఠాన్ సలీంను ఎన్నుకున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా ఉన్న సలీంను డీసీసీ ఉపాధ్యక్షుడిగా, దాసరి చింతలయ్యను పట్టణ అధ్యక్షుడిగా నియమించామన్నారు.

రైతులను కష్టాల నుంచి గట్టెక్కిస్తాం

- సంఘాల బలోపేతమే డీసీసీబీ లక్ష్యం



మొక్కను నాటుతున్న సీఈవో

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న రైతులను వాణిజ్య బ్యాంకుల కంటే ఎక్కువ స్థాయిలో ఆదుకునేందుకు అనేక పథకాలు, కార్యక్రమాలను జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అమలు చేస్తుందని సీఈవో రామాంజనేయులు అన్నారు. గురువారం పర్యావరణ పరిరక్షణలో దినోత్సవంలో భాగంగా కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సీఈవో రామాంజనేయులు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయ సహకారాలతో పాటు డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో బ్యాంకుతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేస్తామని సీఈవో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సంఘం పర్సన్ ఇన్‌చార్జి నాగరమణయ్య, కృష్ణానగర్ డీసీసీబీ మేనేజర్ రమాదేవి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంట్లో నాసిరకం పత్తి విత్తనాలు స్వాధీనం



నకిలీ పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మంత్రాలయం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):మంత్రాలయం మండలం మాజీ జడ్పీటీసీ ఆర్. లక్ష్మయ్య ఇంట్లో భారీగా నాసిరకం పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. గురువారం కర్నూలు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి విశ్వనాథ్, భరత్ మాజీ జడ్పీటీసీ ఇంట్లో సోదాలు చేసి నాలుగు బస్తాల్లో ఉన్న నాసిరకం పత్తి విత్తనాలను పట్టుకున్నారు. దాదాపు వీటి విలువ రూ.1.65 లక్షలు ఉండవచ్చని అంచనా వేశారు. స్థానిక మండల ఏవో జీర గణేష్, వీఆర్వో ప్రభాకర్, వీఆర్ఏ ఈరన్న పంచనామా చేశారు. అధికార పార్టీ నాయకుడి ఇంట్లో భారీగా లూజు నాసిరకం పత్తి విత్తనాలు లభ్యమైన ఘటనలో నియోజకవర్గ స్థాయి నాయకుల ఒత్తిడితో కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. లక్ష్మయ్య ఇంట్లో ఉన్న పత్తి విత్తనాలు ఆయన అన్న గోపాల్ కుమారుడు నాగమల్లేష్ పేరుతో ఉన్నట్లు కేసు నమోదు చేశారు. మూడు నిండు బస్తాలు, ఒక సగం బస్తాల్లోని 165 కేజీల నాసిరకం పత్తి విత్తనాలు మార్కెట్‌లో దాదాపు రూ.3 లక్షల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. రైతు తాను పండించిన విత్తనాలను కంపెనీలకు విక్రయించి కొంత విత్తనాలు స్థానిక రైతులకు విత్తనాలు కోరడంతోనే ఇంట్లో నిల్వ ఉంచి రైతులకు స్వచ్ఛందంగా అందిస్తున్నామని రైతు నాగమల్లేష్ పేర్కొంటున్నారు. ఈ పట్టుబడిన విత్తనాలు నకిలీవా..? అసలైన విత్తనాలా? అనేదానిపై ల్యాబ్‌కు పంపించి నిర్ధారణ చేస్తామని విజిలెన్స్ అధికారి విశ్వనాథ్, మండల ఏవో జీర గణేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు లైసెన్సు విత్తనాలు అందించేందుకు ప్రోత్సహిస్తుండగా.. అధికార పార్టీకి చెందిన నాయకుడే నాసిరకం విత్తనాలు తన ఇంట్లో పెట్టుకుని విక్రయిస్తుండటం నియోజకవర్గంలోనే చర్చనీయంశంగా మారింది. 165 కేజీల విత్తనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో వీపీఏలు మదార్, దినేష్ ఉన్నారు.









ఔటర్ రింగ్ రోడ్డు పనులను ప్రారంభించాలి

కర్నూలు కలెక్టరేట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు నుంచి హైదరాబాదు ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తున్న ఔటర్ రింగ్ రోడ్డు పనులను ప్రారంభించాలని కలెక్టర్ రంజిత్ బాషా మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కలెక్టర్ డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి గుడి వద్ద జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు నెలలోపూ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. ఉల్చాల, గాయత్రీ ఎస్టేట్ జంక్షన్ అభివృద్ధి పనుల్లో పురోగతి తీసుకురావాలని కమిషనర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ముందు ఉన్న పండ్ల దుకాణాలను కూడా హాస్పిటల్ లోపల ఒక స్థలంలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిష్కరించాలని జీజీహెచ్ ఏవోకు సూచించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పాఠశాలలు రీఓపెన్ అవుతున్నాయని, ప్రతి పాఠశాలకు సంబంధించిన బస్సులు, వ్యాన్ల ఫిట్‌నెస్‌ను పరిక్షిం చాలని రవాణ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, పంచాయతీరాజ్ ఈఈ మద్దన్న, ఆర్డీవో భరత్, అడిషినల్ డీఎంహెచ్‌వో భాస్కర్, డీసీహెచ్ శ్రీనివాసరావు, జీజీహెచ్ ఏవో సింధూ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు పెంచాలి

యూనియన్ రాష్ట్ర కోశాధికారి సమీర్ బాషా

కర్నూలు న్యూసిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎస్.సమీర్ బాషా డిమాండ్ చేశారు. కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. సమీర్ బాషా మాట్లా డుతూ గత ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు జీతంతో పాటు హెల్త్ అలవెన్సు పెంచి రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24వేలు మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు సేవలను ఎందుకు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకుని జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో నీటి సర ఫరా, వీధిదీపాలు ఆపేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగశేషులు, జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి యాసిన్ బేగ్, గంగమ్మ, ఈశ్వరి, రేణుక, మధుబాబు, జ్ఞానమ్మ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూడిచర్ల జాతీయ రహదారి సమీపంలో నీటికుంటల వద్ద ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మొక్కలు నాటారు. అనంతరం గుట్టపాడు గ్రామ సమీపంలోని ఉక్కు పరిశ్రమ సమీపాన ఏపీఐఐసీ ఎంఎస్ఎం ఇండస్ట్రియల్ పార్కులో నూతన ప్రమోపాలి ప్యాక్ మల్టికలర్ ప్రింటింగ్ ఫ్లెక్సిబుల్ ప్యాకేజింగ్ ఇండస్ట్రీ పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీడీ పద్మావతి, ఏపీ వో మద్దేశ్వరమ్మ, ఈసీ మధుశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, టీడీపీ నాయకులు మహబూబ్ బాషా, పుల్లారెడ్డి, ప్రకాశం, తిరుపాలు పాల్గొన్నారు.

పున్నమి రెస్టారెంటును నందనవనంగా తీర్చిదిద్దండి: పున్నమి రెస్టారెంటును నందనవనంగా తీర్చిదిద్దాలని పున్నమి రెస్టారెంటు డివిజన్ల మేనేజర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. గురువారం ఓర్వకల్లు గ్రామ సమీపానగల రాక్ గార్డెన్ రిసార్ట్‌లో ప్రపంచ పర్యావరణ దినో త్సం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో యూనిట్ మేనే జర్ జీవన్, సిబ్బంది పాల్గొన్నారు.


ఓర్వకల్లు పున్నమి రెస్టారెంటులో మొక్క నాటుతున్న డివిజన్ల మేనేజర్

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన కళాశాల ఆవరణలో సెట్కూరు సీఈవో కె.వేణుగోపాల్, ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు మొక్కలు నాటారు. జిల్లా ఎంప్లాయిమెంటు ఆఫీసర్ బసవారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

● బీజేపీ ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ పరిధిలోని ఆదర్శనగర్, అంజనాద్రి వైట్ హౌస్ అపార్టుమెంటు పరిసర ప్రాంతాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీఎస్ నాగరాజు యాదవ్ మొక్కలను నాటారు. నాయకులు రామస్వామి, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, గీతామాధురి పాల్గొన్నారు.

గూడూరు: మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడు దామని ఆలయ అధికారులు అన్నారు. గురువారం మండలంలోని కె నాగలాపురంలోని కె సుంకులాపరమేశ్వరి ఆలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

కర్నూలు న్యూసిటీ: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని కార్పొరేషన్ ఏఈ వైష్ణవి అన్నారు. గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు.

● సీపీఐ కార్యాలయం ఆవరణలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శులు జి.చంద్రశేఖర్, సి.మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ బి.రామాంజనేయులు పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా కాంకర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కళాశాల విద్యార్థులతో రైల్వేస్టేషన్‌లో మొక్కలు నాటించి, ప్రతిజ్ఞ చేయించారు. రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మున్నాజీ, రైల్వే ఎలక్ట్రికల్ ఎస్ఎస్ఈ నాగరాజు పాల్గొన్నారు.

కర్నూలు, అర్బన్: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో ఆవరణలో ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సీఐలు, ఎస్ఐలు మొక్కలు నాటారు.

కర్నూలు కల్చరల్: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆయనతోపాటు సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, ఇన్‌చార్జి జిల్లా ఉపాధికల్పన అధికారి పి. సోమశివారెడ్డి మొక్కలు నాటించారు. గ్రీన్‌కోర్ సంస్థ ప్రతినిధి యాగంటీశ్వరప్ప, ఉప గ్రంథాలయ అధికారి పెద్దక్క, లైబ్రేరియన్లు బాషా, వజ్రాల గోవిందరెడ్డి పాల్గొన్నారు.


పూడిచర్లలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



బి.క్యాంపు వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో మొక్క నాటుతున్న సెట్కూరు సీఈవో వేణుగోపాల్


మొక్క నాటుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో.. గూడూరు మండలం కె.నాగలాపురంలో..

హృద్రోగికి ఓసీటీతో చికిత్స

కర్నూలు హాస్పిటల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఓ 69 ఏళ్ల హృద్రోగికి ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫి (ఓసీటీ) పరికరంతో చికిత్సను నగరంలోని విజయదుర్గ కార్డియాక్ సెంటర్‌కు చెందిన కార్డియాలజిస్టులు డా.ఏ. వసంతకుమార్, డా.ఏ. అనిరుద్ విజయవంతంగా నిర్వహించారు. గురువారం కర్నూలులో నిర్వహించిన ఓసీటీ గుండె చికిత్స విధానంపై వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన 69 ఏళ్ల ఓ వృద్ధుడు ఆయాసంతో బాధపడుతూ గుండెపోటుతో వారం రోజుల క్రితం హాస్పిటల్‌కు వచ్చారని, అతనికి అంజియోగ్రామ్ నిర్వహించినట్లు తెలిపారు. మూడు రక్తనాళాలు సన్నబడినట్లు గుర్తించామన్నారు. దీంతో రోగికి ఓసీటీ పరికరం ద్వారా గుండె లోపల రక్తనాళాలలోనికి పంపించి చికిత్సను నిర్వహించారు.

నూతన కార్యవర్గానికి టీజీ వెంకటేశ్ అభినందన


మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న అలంపూర్ ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్నదాన సత్రం ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని ఆలయ ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్నదాన సత్రం నూతన కార్యవర్గ సభ్యులను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అభినందించారు. గురువారం ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం నూతన కార్యవర్గ సభ్యులుగా గురువారం అలంపూర్‌లో వారు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారు టీజీ వెంకటేశ్‌ను మౌర్య ఇన్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్‌ను వారు సత్కరించారు. నూతన కమిటీ అధ్యక్షులుడిగా చిలుకూరు రమేష్, గౌరవ చైర్మన్‌గా సిద్ధ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరు నాగరాజు, కోశాధికారిగా ఇల్లూరు వెంకట రామయ్య శెట్టి తదితరులతో పాటూ 60 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వీరందరినీ టీజీ వెంకటేశ్ సత్కరించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ అలంపూర్ నిత్యాన్న దాన సత్రం సముదాయంలో నూతనంగా కల్యాణ మండపాన్ని నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు ఇల్లూరు లక్ష్మయ్య, నాగేళ్ల రాజగోపాల్, వాయిగండ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

పదోన్నతులను మాన్యువల్‌గా నిర్వహించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల ప్రధానోపా ధ్యాయుల పదోన్నతులను మాన్యువల్ విధానంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, నాయకులు జి.వీరచంద్రయాదవ్, ఎం.సుంకన్న డీఈవో శామ్యూల్ పాల్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పదోన్నతుల కోసం తయారు చేసిన సీనియారిటీ జాబితాలో కార్పొరేషన్ నుంచి మున్సిపాలిటీకి బదిలీ అయిన వారి విషయంలో రోస్టర్ పాయింట్లు విషయంలో తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేసిన తర్వాతనే పదోన్నతులను చేపట్టాలని డీఈవోను కోరారు.

వైఎస్ షర్మిల పర్యటన విజయవంతం చేయాలి

కర్నూలు, అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జీలానీ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11న సాయంత్రం 3 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగే కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన విధివిధానాలు తెలియజేస్తారన్నారు. సుధాకర్ బాబు, దామోదరం రాధాకృష్ణ, సయ్యద్ ఖాద్రీ, బతుకన్న పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించండి: ఎంపీపీ

కర్నూలు రూరల్ జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అన్నారు. కర్నూలు ఎంపీపీ సమావేశ భవనంలో గురువారం కర్నూలు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈసందర్భంగా వెంకటేశ్వ రమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించేం దుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఎంపీడీవో రఘునాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చాలని, అందులో ఏమాత్రం నిర్లక్షం వహిం చరాదని అన్నారు. అంతక ముందు మండల స్థాయి అధికారులు వారి శాఖకు సంబంధించిన అజెండా కాపీలను సభ్యులకు చదివి వినిపిం చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈవోఆర్డీ జాకీర్‌హుస్సేన్, గార్గేయపురం మెడికల్ అధికారి, పీఆర్ ఏఈ ముక్తార్‌బాషా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకాలు జీవిత గమ్యాన్ని చూపే మార్గదర్శకాలు

కర్నూలు కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో లభించే పుస్తకాలు జీవిత గమ్యాన్ని చూపే మార్గదర్శకాలని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. గత ముప్పయ్ అయిదు రోజులుగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కొనసాగిన 'బాలల వేసవి విజ్ఞాన పునశ్చరణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముగింపు వేడుకలు, బాలలకు బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వేణుగోపాల్ హాజరై ప్రసంగించారు. అతిథి ఇన్‌చార్జి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి పి.సోమశి వారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఉచితంగా సేవలు అందించిన రిసోర్స్ పర్సన్లు (శిక్షణ శిబిర బోధకులు)డాక్టర్ ఎం. నాగరాజు, యాగంటీశ్వరప్ప, దామోదర్‌రావు, డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, గోపాలకృష్ణ, జి. వెంకటేశ్వర్లు, రామమోహన్, ఇందుమతి, హాసిని, మాలిక్ బాషా, రవికిరణ్ రెడ్డి, నిఖిలేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ఎన్. మద్దులేటిలకు జ్ఞాపికలు అందజేసి శాలువలతో సత్కరించారు.

క్షయ వ్యాధి నివారణకు కృషి చేద్దాం



ప్రజలకు టీబీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ త్రివేణి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ త్రివేణి అన్నారు. గురువారం 16వ వార్డు సచివాలయ ఆవరణంలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెండు వారాల పై దగ్గు, సాయంకాలం జ్వరం రావడం, బరువు తగ్గడం ఆకలి మందగించడం, ఛాతిలో నొప్పి రావడం, దగ్గినప్పుడు గళ్ళతో పాటు రక్తం పడడం, టీబీ వ్యాధిని గళ్ళ పరీక్ష చేయడం వలన నిర్ధారించ వచ్చున్నారు. టీబీ లక్షణాలు ఉంటే పరీక్ష చేయించుకుని మందులు ఉచితంగా పొందవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరు క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బాబురావు, ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్లు పద్మ, జ్యోతి పాల్గొన్నారు.

మద్దికెర: ఎవరైనా క్షయ వ్యాధి బారిన పడితే మందులతో నివారించవచ్చని, ఎవరూ భయపడాల్సిన పనిలేదని ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో సర్పంచు బురుజుల విజయుడు అధ్యక్షతన ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ జాతీయ క్ష.య నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, ఆరోగ్య కార్యకర్త గాయత్రి తదితరులు ఉన్నారు.

రాయితీతో పశువులకు దాణా మంజూరు

మద్దికెర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువులకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో దాణాను మంజూరు చేసిందని పశువైద్యాధికారి కృష్ణనాయక్ తెలిపారు. గురువారం స్థానిక పశువైద్యాశాలలో దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 175 క్వింటాళ్ల దాణా మంజూరైందని తెలిపారు. 50 కిలోల పశువుల దాణా ధర రూ.1120లకు గాను రాయితీ పోను రూ.560 చెల్లిస్తే 50 కిలోల బస్తాను ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లాలని కోరారు. పశువులకు దాణా వేయడంతో ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పశువులకు మేత కరువైన వారు ఈ దాణా పెట్టాలన్నారు. కాన్పు అయిన పశువులకు ఈ దాణా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పశువుల ఆరోగ్యం పట్ల పశు పోషకులు నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది ఉన్నారు.

భూ సేకరణను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్, జూన్ 5 ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుప్పగల్ సమీపంలో నిర్మించే రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం నిర్మించే భూసేకరణను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం కౌతాళం సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం కోసం స్థానికులు సహకరించాలని, అధికారులను సైతం వేగవంతంగా భూసేకరణ చేయాలన్నారు. సమావేశంలో ఆదోని డిప్యూటీ తహసీల్దార్ గుండాల నాయక్, కౌతాళం తహసీల్దార్ రజినీకాంత్‌రెడ్డి, సర్వేయర్లు వేణు సూర్య, ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

మద్దికెర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని పంచాయతీ సలహాదారులు జయరాం స్వామి, తాలుకా తెలుగు యువత నాయకులు ఆకుల వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎడవలి గ్రామంలో ఈడిగ ఓబులేసు అను వ్యక్తికి రూ.85వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు కావడంతో అందజేశారు.



బాధితుడికి చెక్కును అందజేస్తున్న నాయకులు



పర్యావరణ దినోత్సవం లోగోతో ఎమ్మెల్యే కేఈ



నిజాముద్దీన్ కాలనీలో మొక్కలు నాటుతున్న కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్



మొక్క నాటుతున్న టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్

భావి తరాలకు పర్యావరణాన్ని కాపాడాలి

పత్తికొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడి భావి తరాలకు అందించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని పత్తికొండ మండలం కోతిరాళ్ల గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలను నాటి మరొకరికి ఆదర్శంగా నిలిచి వాటి బాధ్యతగా తీసుకోవాలని కోరారు. నేటి కాలంలో పర్యావరణానికి హని కల్గించే ప్లాసిక్ వాడకాన్ని తగ్గించాలని అన్నారు. చెట్లను పెంచడంతో మానవాళికి మంచి ఆరోగ్యకరమైన ఆక్సిజన్ అందుతుందన్నారు. ప్రతి నీటి చుక్కను వృథా చేయకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటపతి, నాగేష్, ఏపీడి లక్ష్మన్న, ఏపివో వెంకటేశ్వర్లు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం, ఈసి జిలాన్‌లతోపాటు గ్రామనాయకులు పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజాముద్దీన్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కలుషితం కాకుండా మొక్కలు నాటుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ వెంకప్ప, ఏఎన్ఎం విద్యావతి, రాణి, వెల్ఫేర్ సెక్రెటరీ భువనేశ్వరి, మునిసిపాలిటీ శానిటేషన్ మేస్త్రి మహేష్, నందీష్, ఐరప్ప, ఈరన్న పాల్గొన్నారు.

● ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ నాయకులు మొక్కలు నాటి కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్దికెర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, ఏపీవో నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు సుహాసిని, ఎంపీపీ అనిత, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, ఎంపీటీసీ ఆంజనేయులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు అన్నారు. గురువారం వెల్దుర్తిలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అలాగే టీడీపీ మండల కన్వీనర్ బలరాంగౌడు, యువనాయకుడు రమాకాంత్‌రెడ్డిలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్, శ్రీదేవి, నాగసురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: మొక్కలు నాటి వాటిని పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, వెంకటస్వామి, ఏపీవో హేమసుందర్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని చెన్నంపల్లి, తుగ్గలి, జొన్నగిరి, ఉప్పర్లపల్లి తదితర గ్రామాల్లో సచివాలయాలు, పాఠశాలల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పా వేణుగోపాల్, వెంకటస్వామి, మిద్దె రవికుమార్, బాలన్న, విశ్వనాథ్, జయచంద్ర, అంజి, వెంకటయ్య, జయరాం నాయక్, బలరాముడు, మల్లి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని ఏవో శివశంకర్ అన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యాలయం ముందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈరన్న, ఏఈవో ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: మొక్కలు పెంచడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం ఆలూరు మండలం హులేబీడు గ్రామ సచివాలయంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో మద్దిలేటి స్వామి, టీడీపీ నాయకులు వన్నూరువలి, వెంకటేష్, గోపాల్, కేశన్న పాల్గొన్నారు.

ఆదోని రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. గురువారం డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుసూదన్ ఆచారి, పంచాయతీ కార్యదర్శి నాగరాజుతో కలిసి పెద్దహరివాణంలో పర్యటించి చెత్తనుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి అనంతరం ప్రపంచ పర్యావరణ సందర్భంగా పలు రకాల మొక్కలను నాటడంతో పాటు మొక్కలను స్థానికులకు పంపిణీ చేశారు.

ఆదోని: మొక్కలు నాటి కలుషితమవుతున్న పర్యావరణాన్ని కాపాడుకుందామని ఆదోని మొదటి సాధనకు జూనియర్ సివిల్ న్యాయాధికారి సాయిప్రభాస్ ప్రిన్సిపాల్ సివిల్ న్యాయాధికారి అర్చన అన్నారు. గురువారం పట్టణంలోని ఇందినాగర్ మునిసిపల్ పార్కులో పురపాలక కమిషనర్ కృష్ణతో కలిసి మొక్కలు నాటారు.

దేవనకొండ: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీడీవో టీవీ రమణరావు, ఎన్ఆర్‌జీఎస్ ఏపీడీ లక్ష్మన్న, అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్క నాటాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రాజునాయక్, కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌శర్మ, తదితరులు ఉన్నారు.



చెన్నంపల్లిలో మొక్కలు నాటుతున్న దృశ్యం



మద్దికెరలో మొక్క నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



జూనియర్ కళాశాలలో మొక్క నాటుతున్న అధికారులు



మొక్క నాటుతున్న మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు



ఇందిరానగర్ పార్కులో మొక్క నాటుతున్న సివిల్ న్యాయాధికారి సాయి సుభాష్

కనీస వేతనం అమలు చేయాలి

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పీరా సాహెబ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని భీమాస్ కూడలిలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పీరా సాహెబ్, జనరల్ సెక్రెటరీ సోమన్న, ట్రెజరర్ అహ్మద్ మాట్లాడారు. దశాబ్ద కాలంగా చాలీచాలని వేతనాలకు పని చేస్తున్నామని, ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు. టెక్నికల్ రూ. 29 వే లు, నాన్ టెక్నికల్ రూ. 24,500 వేతనం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు శివకుమార్, కృష్ణమూర్తి, శరత్, రామాంజి, కరెప్ప, వీరేష్, భరత్ తదితరులున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవిశెట్టి ప్రకాష్ యూటీఎఫ్ అధ్యక్షుడు సునీల్ రాజ్‌కుమార్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామని మున్సిపల్ చైర్మన్ సీహెచ్ లోకేశ్వరి హామీఇచ్చారు. శిబిరాన్ని సందర్శించి కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్, బాలాజీ మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు.



దీక్ష చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందికి సంఘీభావం తెలుపుతున్న చైర్‌పర్సన్ లోకేశ్వరి

న్యాయవాదుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండ

ఆలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు మృతి చెందితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.92 లక్షలు విడుదల చేస్తూ జీవో నంబర్ 202ను జారీ చేయడం హర్షణీయమని టీడీపీ పార్టీ లీగల్ సెల్ అధికారి ప్రతినిధి ఎం. జనార్దన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై యేడాది లోపే రాష్ట్రంలో మృతి చెందిన న్యాయవాది కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం నిధులను విడుదల చేసిందన్నారు. న్యాయవాదులు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు, న్యాయ శాఖ మంత్రి ఫరూక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ

● రెండు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్

ఆదోని , జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చందసాహెబ్ దర్గా సమీపంలో గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో ఓలారీ ఏకంగా డివైడర్ పైకి దూసు కెళ్లింది. దీంతో రెండు గంటల మేర ట్రాఫిక్ అంతరాయం కలగడంతో దాదాపు 2 కిలో మీటర్ల మేర ఎక్కడిక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ఘటనాస్థలికి ట్రాఫిక్ పోలీసులు చేరుకొని డివైడర్‌పై ఎక్కిన లారీని కిందికి దించారు. అనంతరం ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

ప్రతిభ అవార్డులకు ఎంపిక



అనూష



శ్రియ



గౌతమి నంద

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఇంటర్మీడియట్, పదో తరగతి అధిక మార్కులు సాధించిన వారికి అందించే ప్రతిభ అవార్డులకు అక్షరశ్రీ జూనియర్ కళాశాల, పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసింది. ఇంటర్ రెండవ ఏడాది బైపీసీలో బి. అనూష 990/1000, పీ శ్రియ 976/1000, పదో తరగతిలో స్కూల్ టాపర్ కె గౌతమినందను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు కరస్పాండెంట్ మేఘనాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ శ్రీధర్ రెడ్డి, రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు.

గోవధ జరగకుండా చూడాలి

దేవనకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గోవును హిందువులు దైవంగా భావిస్తారని, బక్రీద్ పర్వదినాన ముస్లింలు గోవధ చేయకుండా చూడాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆకుల భీమేష్, మల్లికార్జునరెడ్డి కోరారు. వారు స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు బోడ రవి, నరసింహులు, ఈరన్న ఉన్నారు.

ఉనికి కోసమే వెన్నుపోటు దినం



మాట్లాడుతున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టీడీపీ నేత వైకుంఠం శివప్రసాద్



మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

ఆలూరు, జూన్5(ఆంధ్రజ్యోతి): సొంత బాబాయిని, తోడబుట్టిన చెల్లిని వెన్నుపోటు పొడిచిన జగన్ రెడ్డి సీఎం చంద్రబాబు వెన్నుపోటుదారుడని ఆరోపించడం సరికాదని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. గురువారం ఆలూరు వారు వారు మాట్లాడుతూ జగన్ డ్రామాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని సీఎం చంద్రబాబు అమలు చేస్తారన్నారు. జగన్ తన ఉనికి కోసం కుంభకోణాల నుంచి ప్రజలను డైవర్ట్ చేసేందుకు వెన్నుపోటు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. నిజమైన వెన్నుపోటుదారుడు ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. కూటమి ప్రభుత్వం 70 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి, నాయకులు కురువ జయరాం, రామచంద్రనాయుడు, శేషగిరి, ఉచ్చీరప్ప, బిల్లేకల్ వెంకటేష్, కృష్ణయాదవ్, రామారావు, కిషోర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: జగన్ ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్ర ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పనులు చేయకుండా రాష్ట్రాన్ని నాశనం చేశాడని టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, బలరాం గౌడు, రమాకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ అధికారం కోసం సొంత బాబాయిని హత్యచేయించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమర్‌నాథ్‌గౌడు, రామకృష్ణాచారి, సుధాకర్‌గౌడు, బజారు, మద్దిలేటి పాల్గొన్నారు.

తుగ్గలి: టీడీపీ అజెండా ప్రజా సేవ చేయడం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళితే.. వైసీపీ అజెండా విమర్శలు చేయడం, వెన్నుపోటు పొడవడమే వారి అజెండా లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. గురువారం తుగ్గలిలో నాగేంద్ర స్వగృహంలో వారు మాట్లాడుతూ బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినోత్సవం నిర్వహిచడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును విమర్శించే స్థాయి కాదన్నారు. తన గెలుపు కోసం కష్టపడిన తల్లిని, చెల్లిని వెన్నుపోటు పొడిచిన చరిత్రహీనుడు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపాల్‌నాయుడు, మాబాషా, శ్రీరాములు చౌదరి, వల్లె వెంకటేశ్, సత్యప్రకాష్, బలరాముడు, కృష్ణ, కోటేష్‌గౌడు ఉన్నారు.



తుగ్గలిలో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

చిప్పగిరి: వెన్నుపోటు పొడిచిన చరిత్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే చెందుతుందని జడ్పీటీసీ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఏరూరు మీనాక్షి నాయుడు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పార్టీకి సేవలందించి గెలుపు బాటలో కీలకపాత్ర వహించిన తల్లి, చెల్లిని దూరం చేసిన రెడ్డి వెన్నుపోటు దారుడు కాడ అంటూ ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో బెల్డొనా వెంకటేష్, సతీష్, ఏరూరు మిరపకాయల చంద్ర, విశ్వనాథ్, నరసింహులు, రామాంజినేయులు, సర్పంచులు పురుషోత్తం సుశీలమ్మ, సురేష్, సంగాల భాస్కర్ పాల్గొన్నారు.

మద్దికెర: వైసీపీ నాయకులకు అభివృద్ధి కనిపించడం లేదని టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వైసీపీ పార్టీ నాయకులు వెన్నుపోటు దినం పత్తికొండలో నిర్వహించడం సిగ్గుచేటన్నారు. సంక్షేమ పథకాలు ఇవ్వలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పర రంగయ్య, పారా రాఘవేంద్ర, సర్కార్ గోపాల్, రమేష్, వీరేష్, గడ్డం మల్లికార్జున, దస్తగిరి, కృష్ణ, సోము ఉన్నారు.

క్రిష్ణగిరి: రాష్ట్రంలో జగనే పెద్ద వెన్నుపోటుదారుడని పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబీ సాహెబ్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి గురుస్వామి అన్నారు. గురువారం వారు మాట్లాడారు. ఎమ్మెల్యే శ్యాంబాబును విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే శ్రీదేవికి లేదన్నారు.



వెల్దుర్తిలో మాట్లాడుతున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి, జూన్5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. గురువారం సీపీఐ మహాసభలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు, వర్షపునీరు ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటుందన్నారు. అనంతరం సీపీఐ పట్టణ సమితి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా హనుమంతు, సహాయ కార్యదర్శిగా చంద్రశేఖర్‌లతో పాటు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు విరుపాక్షి, కృష్ణమూర్తి, బ్రహ్మయ్య, ఉరుకుందు, రంగస్వామి, మల్లికార్జున, రంగన్న పాల్గొన్నారు.

అమ్మ ఆసుపత్రి ప్రారంభం

ఆలూరు, జూన్5(ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రాంతంలో ఆధునిక వసతులతో 24 గంటలు వైద్యసేవలు ఉండేలా అమ్మ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, ఆదోని, గుంతకల్ మాజీ ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం ఆలూరు పట్టణంలో నిర్మించిన అమ్మ ఆసుపత్రిని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎండీ పచ్చర్లప్లి రాఘవేంద్రరెడ్డి, వైసీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కురువ శశికళ కృష్ణమోహన్, నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, మారయ్య, జనార్దన్‌నాయుడు, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్, ఆదోని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు ఉమ్మిసలీం పాల్గొన్నారు.



ఆసుపత్రిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఎల్లార్తి దర్గా ముజావర్ మృతి

హొళగుంద , జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్లార్తి షేక్షవలి, షాషావలి సాహెబ్‌ల దర్గా ముజావర్ (పూజారి) మహమ్మద్ షఫీ(32) మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. పూజారికి 13 నెలల కుమార్తె ఉంది. భక్తులు, గ్రామస్థులు నివాళి అర్పించారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

వెల్దుర్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలో గుంటుపల్లె గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ టీడీపీ నాయకుడు ఈదుల వెంకటరాముడు అన్నారు. గురువారం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖరవర్మకు వినతి పత్రం అందజేశారు.

ప్రాణాలతో చెలగాటం

● అరకొర అనుమతులతో ల్యాబ్‌లు, క్లినిక్‌ల నిర్వహణ
● జిల్లా అధికారుల తనిఖీల్లో తేటతెల్లం

ఎమ్మిగనూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో కొంత మంది అనుమతి ల్యాబ్‌లు, క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తమ అక్రమ సంపాదన కోసం ప్రజల అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ అక్రమార్కుల బండారం ఇటీవల పట్టణంలో వినియోగదారుల రక్షణమండలి ఆధ్వర్యంలో జరిపిన తనిఖీల్లో తేటతెల్లమయింది. లైసెన్స్ లేకుండానే పాలకేంద్రం నిర్వహిస్తున్న విషయం వెలుగుచూసింది. అలాగే పట్టణంలో ప్రముఖ ల్యాబ్‌కు ట్రేడ్ లైసెన్స్, ప్రొఫెషనల్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ లేదు, సర్టిఫైడ్ పెథాలజిస్టులకు అనుమతుల పత్రాలు లేవని తేలింది. అలాగే పెట్రోల్ బంకుల్లో కూడా వినియోగదారులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు లేవని అధికారులు తేల్చారు. వైద్యం కోసం పట్టణానికి వచ్చిన రోగులను వ్యాధి నిర్ధారణ కోసం డాక్టర్లు ప్రముఖ ల్యాబ్‌లకు పంపుతున్నారు. ల్యాబ్‌ల నిర్వాహకులు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అధికారుల తనిఖీల్లో ఆ ల్యాబ్‌కు అనుమతులు లేవని తేలింది. అర్హత లేని వారితో పరీక్షలు నిర్వహించి రిపోర్టులు ఇస్తున్నట్లు తేలింది. గతంలో ఓ వ్యక్తి రక్త పరీక్షలు చేయించుకోగా క్యాన్సర్ ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. ఆందోళనతో ఆయన కర్నూలులో పరీక్షలు చేయించుకోగా ఎలాంటి జబ్బు లేదని తేలింది. అరకొర అనుమతులు ఉన్న ల్యాబ్‌కు పట్టణంలోని కొంతమంది వైద్యులు పరీక్షల కోసం పంపటం పలు అనుమానాలకు తావిస్తోంది. అంతేగాక గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కొంతమంది పీఎంపీలు, ఆర్ఎంపీలు కూడా వివిధ పరీక్షల కోసం ఈ ల్యాబ్‌కు పంపటం గమనార్హం. వాస్తవంగా జిల్లా వైద్యాధికారుల అనుమతులు తీసుకున్న తరువాత క్లినిక్‌లను ఏర్పాటు చేసుకోవాలి. అయితే సోమప్ప సర్కిల్, శివసర్కిల్, పోలీసు స్టేషన్ సమీపంలో, గోనెగండ్ల రోడ్డులో కొంతమంది మెడికల్ దుకాణాల యజమానులు వైద్యులను ఏర్పాటు చేసుకుని క్లినిక్‌లను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో గాంధీసర్కిల్‌లో అనుమతులు లేని క్లినిక్‌పై విజిలెన్స్ దాడులు చేసి సీజ్ చేశారు. అలాగే సోమప్ప సర్కిల్‌లో కూడా ఓ మెడికల్ దుకాణ ంలో అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహించి ఓ బాలుడి ప్రాణాలను బలిగొన్నారు. ఇలా ప్రభుత్వ అనుమతులు లేకుండా క్లినిక్‌లు, ల్యాబ్‌లు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నా అడిగే నాథుడే కరువయ్యాడని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు, రక్షణ మండలి సభ్యులు (ఫైల్)

అధికారులు తనిఖీలు నిర్వహించాలి

పట్టణంలో అనుమతులు లేకుండా ల్యాబ్‌లు, క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారిపై అధికారులు ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలి. అధికారుల తనిఖీలు లేకపోవటం వల్లే ఇష్టానుసారంగా క్లినిక్‌లు, ల్యాబ్‌లు నిర్వహించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుని ప్రజ లకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలి.

-రంగన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి, ఎమ్మిగనూరు

చర్యలు తీసుకుంటాం

అనుమతులు లేకుండా క్లినిక్‌లు, ల్యాబ్‌లు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకు ల్యాబ్‌లు, క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవు. ఇటీవల పట్టణంలో ఓ ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహించిన సమయంలో అనుమతులకు సంబంధించిన పత్రాలు చూపలేదు. అయితే తరువాత మా కార్యాలయానికి వచ్చి యజమాని చూపారు. అన్ని అనుమతులు ఉన్నాయి. వీటిని డీఎంఅండ్ హెచ్ఓ కార్యాలయంలో అందజేయాలని చెప్పాం.

-సత్యవతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆదోని

క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పావని

కౌతాళం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు క్షయ వ్యాధిపై అవగాహనతో ఉండాలని కౌతాళం వైద్యాధికారి పావని అన్నారు. గురువారం మండలంలోని పొదలకుంట గ్రామంలో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయతో చాల మంది ప్రజలు బాధపడుతున్నారని వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి రక్షణ పొందవచ్చని ఆమె తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో వర్లబుల్ పాపులేషన్ 60 సంవత్సరాలు పైబడిన వారు, బీపీ, షుగర్ ఆల్కహాల్ తీసుకునేవారు, ధూమపానం చేసేవారు ఈ వ్యాధితో ప్రాణాలు కోల్పోతున్నారని, ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు స్వరూప, వైద్యసిబ్బంది సుభాషిణి, కరిముల్లా 104 సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన నాయకులు

కోసిగి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, భారత ప్రభుత్వం, రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్న సందర్భంగా కోసిగి ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి నరసింహులు, రామాంజిల హైదరాబాదులో గురువారం ఆయనను కలిసి పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ కృషి వల్ల ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని దళితుల దేవుడు మందకృష్ణ అన్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పద్మశ్రీ పురస్కారాన్ని అందించిందని కేంద్ర ఎన్‌డీఏ ప్రభుత్వానికి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


అమరావతి పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

కోసిగి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించుకోవాలని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. కోసిగిలోని ఉరుకుంద ఆర్చ్ హాల్వి రోడ్డులో ఏర్పాటు చేసిన నూతన అమరావతి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ గుడిసె గురురాజు చెందిన పాఠశాలను గురువారం రాఘవేంద్రరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి పాఠశాల యజమాన్యం పూలమాలలు వేసి శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తుల కన్నా చదువులు ఇవ్వాలని, ఆస్తులు ఉంటే కరిగిపోతాయని, చదివిస్తే వారు ప్రయోజకులు అవుతారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం గుడిసె పెద్ద రామయ్య, రామాంజనేయులు, టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, ఎస్ఐ హనుమంతరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీఓ ఖాలిక్, ఏపీఎం సత్యమ్మ,పాల్గొన్నారు.

రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే జరిమానా

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే జరిమానా తప్పదని ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం కర్నూలు ప్రధాన రహదారిలో ముమ్మరంగా వాహనాల తనిఖీని చేపట్టారు. అలాగే మద్యం తాగి వాహనం నడపరాదన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ఇంటి నుంచి బయలుదేరే సమయంలో తమకు ఓ కుటుంబం ఉందని గుర్తించుకోవాలన్నారు. ఈ తనిఖీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేసిన కార్మిక చట్టాల మార్పును వ్యతిరేకించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం అయిన మంత్రి మండలిలో తీసుకున్న నిర్ణయాల్లో కాంట్రాక్టు కార్మికుల సమస్యల పట్ల చర్చించకపోవడం చాలా విచారకరం అని అన్నారు కార్యక్రమంలో రాజు, ఇస్మాయిల్, మునింద్ర పాల్గొన్నారు.

30వ రోజుకు చేరిన సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు, ఇతర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 30వ రోజు సమ్మె చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీ సర్కిల్ వరకు వెళ్లి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చెసుకుంటూ వెళ్ళి అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట కూర్చొని తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్ర, నరసప్ప, విజయ్‌కుమార్, శీరాములు, పంపాపతి, సాయి, విజయ్ పాల్గొన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండండి

గోనెగండ్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఘర్షణలకు దూరంగా ఉంటే ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా అభివృద్ధి చెందుతారని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ విజయభాస్కర్ అన్నారు. వారు వేముగోడు గ్రామంలో పర్యటించి, రాత్రి బస చేశారు. గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి


ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న పెద్దమరివీడు వైసీపీ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మిగనూరు,జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం గోనేగండ్ల మండలం పెద్దమరివీడులో వైసీపీకి చెందిన 80 కుటుంబాలు.. ఆ గ్రామనాయకులు కురువ మల్లయ్య, బీటీ లక్ష్మన్న, చిన్ననాగరాజుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి వాటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో మరో రూ. 40లక్షలతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. గ్రామ టీడీపీ నాయకులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురువ మలయ్య, మాజీ సర్పంచ్ రంగముని, నరసింహులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి అందరి బాధ్యత

గోనెగండ్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి ప్రజల అందరి బాధ్యత అని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీధుల్లో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్‌లతో తొలగించారు. అంటువ్యాధులు ప్రబలే సీజన్ కావడంతో గ్రామంలోని పలు వీధులలో దోమల నివారణ మందును మురికి కాలువలలో పిచికారి చేయించారు. కార్యక్రమంలో మలాంగ్‌బాషా, అనిల్, సుబాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు సకాలంలో అందించాలి

మంత్రాలయం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో ప్రజలకు అందించి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోతో మంత్రాలయం టీడీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్, పింఛన్లు, 12వ తేదీ నుంచి అందించే కొత్త పింఛన్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల రుణాలు సకాలంలో అందించాలన్నారు. కోరారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు అశోక్ రెడ్డి, కంసాలి నరసింహ, మేకల నరసింహులు, రాజు, పోలి శివ, పవన్ కుమార్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రహ్లాదరాయల రథోత్సవం


వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం జ్యేష్ఠ మాస దశ శభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణ బోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో మంత్రాలయం పురవీధులన్నీ కిక్కిరిశాయి. పీఠాధిపతి భక్తులకు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో చిక్‌బళ్లాపూర్ ఎమ్మెల్యే:
రాఘవేంద్ర స్వామిని కర్నాటక లోని చిక్‌బళ్లాపూర్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ దర్శించుకున్నారు. శ్రీమఠం మహాముఖ ద్వారం వద్ద ఆయనకు మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంటఐపీ నరసింహామూర్తి, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలు శిక్షే

● నలుగురికి శిక్ష విధించిన ఎమ్మిగనూరు కోర్టు

మంత్రాలయం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన నలుగురికి జైలు శిక్షతో పాటు రూ.1000లు జరిమానా విధిస్తూ ఎమ్మిగనూరు కోర్టు తీర్పు ఇచ్చింది. గురువారం మంత్రాలయం సీఐ రామాంజులు, పోలీసు సిబ్బంది బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన మంత్రాలయం రాఘవేంద్రపురం చెందిన మల్లికార్జున, హనుమంతు, నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన బోయ రాముడు, దాసరి మల్లికార్జున నలుగురిపై కేసు నమోదు చేసి గురువారం ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరిచారు. కమ్యూనిటీ సర్వీసు (కోర్టు పరిసరాల క్లీన్ అండ్ గ్రీన్) ఒక రోజు శిక్ష విధించారు. శిక్ష పడిన వారు కమ్యూనిటీ సేవ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కళాకారులను ప్రోత్సహించాలి

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రోత్సహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న అన్నారు. మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగే డప్పు కళాకారుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ తిమ్మగురుడు, మాణిక్యం, బద్రి పాల్గొన్నారు.

సమ్మెతో అలుముకున్న చీకట్లు


సంజీవ నగర్‌లో వెలగని వీధి దీపాలు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వీధి దీపాలు వెలగక బుధవారం ,కాలనీ వాసులు చీకటిలో గడిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె తీవ్రతరం చేయడం వల్ల కాలనీల్లోని వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ పూర్తి స్థాయిలో విధులకు దూరంగా ఉండి సమ్మెలో పాల్గొనడంతో వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు వెంటనే స్పందించి దీనిపై చర్యలు తీసుకుని వీధి దీపాలు వెలిగేలా చూడాలని ప్రజలు కొరుతున్నారు.

హౌసింగ్ అధికారులతో డిప్యూటీ కలెక్టర్ సమీక్ష


సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందితో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్ పీడీ చిరంజీవి గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరుపట్టణం, ఎమ్మిగనూరు మండలంలో ఇళ్ల నిర్మాణ పై స్థానిక డీఈ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. వివిధ దశల్లో ఉన్న ఇంటి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎఎల్ ప్రభాకర్, డీఈ ప్రసాద్, ఏఈలు కరుణాకర్, కర్రెన్న, మధు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

● ఘనంగా పర్యావరణ దినోత్సవం
● కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు అధికారులు


నాగలదిన్నెలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బీవీ


మొక్క నాటుతున్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, అధికారులు


మొక్క నాటుతున్న ఎంపీటీసీ శశిరేఖ

నందవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నాగలదిన్నె గ్రామ సచివాలయం దగ్గర ఎమ్మెల్యే బీవీ మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కాశీంవలీ, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుధీర్, మాజీ సర్పంచ్ ఈరన్న, జబ్బార్, వహబ్, మునాఫ్ పాల్గొన్నారు.

మంత్రాలయం: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం మంత్రాలయంలో ఎంపీడీవో నూర్జహాన్, ఉపాధి ఏపీవో భక్తవాత్సల్య ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం పురస్కరించుకుని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: మొక్కలే జీవకోటికి ప్రాణధారం అని హనుమాపురం యంపిటిసీ, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు నరవ శశిరేఖ, టీడీపి జిల్లా యువనాయకులు రాకేష్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని కేజీబీవిలో, బసలదొడ్డి గ్రామ సచివాలయం ముందు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యంపీడివో ప్రభావతి, ఈవోపీవోఆర్డీ జయరాముడు, ఏపివో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోనెగండ్ల:
పర్యవరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని గ్రామ సర్పంచ్ హైమావతి అన్నారు. మండల కేంద్రమైన గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉపాధి పథకం ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ హైమావతి మొక్కలు నాటారు. ఉపాధి హామీ టీఏ ఫరూక్, ఎఫ్ఏ రాంపురం రఫిక్, రమేష్‌నాయుడు, పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో:
మండల కేంద్రమైన గోనెగండ్లలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సం సందర్భంగా గోనెగండ్ల మండల బీజేపీ కన్వీనర్ మునిస్వామి గౌడ్, సీనియర్ నాయకుడు మహేష్, సత్యనారాయణ ఉన్నత పాఠశాల ఆవరణం నందు మొక్కలు నాటారు.

అందరు మొక్కలు నాటాలి: ఎంపీడీవో
అందరు మొక్కలు నాటాలి వాటి పరిరక్షణ కోసం బాధ్యత వహించాలని గోనెగండ్ల ఎంపీడీవో మణిమంజరి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సం సందర్భంగా మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది రహదారికి ఇరువైపుల మొక్కలు నాటారు.



కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ హైమావతి